విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి 6లో..

కలెక్టర్‌ను కలిసిన సింగరేణి జీఎంలు 6లో..



మంథని మండలం నాగారంలో సోక్ పిట్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు (ఫైల్)

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ అవార్డులపై అలసత్వం

- మూడు నెలలైనా ప్రకటించని కేంద్రం
- జాతీయ స్థాయికి రెండు పంచాయతీలు
- పదవీకాలం ముగుస్తోందని సర్పంచుల ఆందోళన

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణపై గ్రామ పంచాయతీలను ప్రోత్సహించేందుకుగాను కేంద్ర ప్రభుత్వం 2022-23 ఆర్థిక సంవత్సరానికి తీసుకువచ్చిన స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ అవార్డులను ప్రకటించడంలో కేంద్ర ప్రభుత్వం అలసత్వం వహిస్తున్నది. మూడు నెలల క్రితమే వివిధ అంశాల్లో జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేసి గాంధీ జయంతి రోజైన అక్టోబరు 2వ తేదీన అవార్డులను ప్రదానం చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తున్నది. దీంతో ఈ నెలాఖరుతో తమ పదవీ కాలం ముగుస్తుందని సర్పంచులు ఆందోళన చెందుతున్నారు. జాతీయస్థాయి అవార్డుల ఎంపికకోసం జిల్లాలోని మంథని మండలం నాగారం, ఎలిగేడు మండలం సుల్తానాపూర్, సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి పంచాయతీల వివరాలు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖాధికారులు కేంద్రానికి పంపించారు. ఈ మేరకు కేంద్ర బృందాలు సైతం ఆయా గ్రామాలను సందర్శించి పరిశీలన చేశారు. గ్రామాలు పచ్చగా కళకళలాడే విధంగా, పారిశుధ్య నిర్వహణ, నీటి సంరక్షణ, తదితర అంశాల్లో ఆదర్శంగా నిలిచే విధంగా వివిధ కేటగిరీల్లో అవార్డులు ఇచ్చి ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ అనే కార్యక్రమాన్ని తీసుకు వచ్చింది. ఈ కార్యక్రమాన్ని ఇదివరకు మున్సిపాలిటీల్లో అమలు చేశారు. గడిచిన ఆర్థిక సంవత్సరం నుంచి గ్రామ పంచాయతీల్లో కూడా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రెండు వేల జనాభా ఉన్న గ్రామాల్లో ఐదు పంచాయతీలు, 2001 నుంచి ఐదు వేల జనాభా వరకు ఐదు పంచాయతీలు, ఐదు వేలకు పైగా జనాభా కలిగిన ఐదు పంచాయతీలను ఎంపిక చేయాలని నిర్ణయించారు.

● అక్టోబరు 2 కంటే ముందే ప్రకటించాల్సి ఉన్నా..

మొదట మండల స్థాయిలో ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేసి, ఆ తర్వాత జిల్లా స్థాయిలో 15 పంచాయతీలను ఎంపిక చేస్తారు. ఆ పంచాయతీలను రాష్ట్ర స్థాయి అవార్డుల కోసం పంపిస్తారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన 15 పంచాయతీల వివరాలను జాతీయ స్థాయికి ఎంపిక కోసం పంపిస్తారు. సెప్టెంబరు 16న రాష్ట్రస్థాయిలో అవార్డుల ఎంపిక పూర్తిచేసి అవార్డులను కూడా అందజేశారు. రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ అవార్డుల కోసం 15 పంచాయతీలను పంపించారు. అందులో రెండు వేల జనాభా కేటగిరీలో నాగారం పంచాయతీ, ఐదు వేల వరకు గల జనాభా గల కేటగిరీలో సుల్తానాపూర్, ఐదు వేలకు పైగా జనాభా గల కేటగిరీలో గర్రెపల్లి పంచాయతీ వివరాలను పంపించారు. దీంతో కేంద్ర బృందం ఆ మూడు గ్రామాలను పర్యటించి ఇంటింటికి వెళ్లి మరుగుదొడ్డి ఉందా, ఇంకుడు గుంత ఉందా, తడి చెత్త, పొడి చెత్తను వేరు చేస్తున్నారా, ఈ చెత్తను చెత్త బండి వచ్చినప్పుడే వేస్తున్నారా, కంపోస్టు ఎరువు తయారీ కోసం సోక్ పిట్లు ఉన్నాయా.. వీధి లైట్లను ఎప్పటికప్పుడు ఏర్పాటు చేస్తున్నారా, మురికి కాలువలు, పరిసరాలను పరిశుభ్రం చేస్తున్నారా, చెట్లను పెంచుతున్నారా, గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాలు, ఇతర కార్యాలయాల వద్ద మరుగుదొడ్ల సౌకర్యం ఉందా, లేదా వంటి అంశాలపై పరిశీలన చేసి రిపోర్టును కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. జాతీయ స్థాయిలో ఎంపికయ్యే పంచాయతీలకు 50 లక్షల రూపాయలు ప్రోత్సాహకంగా అందిస్తారు. రాష్ట్ర స్థాయిలో 10 లక్షలు అందజేశారు. అక్టోబరు 2వ తేదీకి ముందే ప్రకటించాల్సిన అవార్డులను కేంద్రం ఇంతవరకు ప్రకటించ లేదు. ఆ అవార్డుల కోసం జిల్లాలోని మూడు పంచాయతీల సర్పంచులు ఎదురుచూస్తున్నారు. జాతీయ స్థాయి అవార్డు తమ పంచాయతీలు ఎంపిక అవుతాయా, లేదా అనే ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. ఈ నెలాఖరులతో పంచాయతీ పాలక వర్గాల పదవీ కాలం ముగియనున్నదని, ఈ విషయమై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ అవార్డులను ప్రకటించాలని సర్పంచులు కోరుతున్నారు.

ఎన్నికల ప్రచార వ్యయ రేట్లు ఖరారు

- అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ లాల్

పెద్దపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎన్నికల ప్రచార ఖర్చుల నమోదుకు సంబంధించిన వ్యయ రేట్లను ఖరారు చేసినట్లు అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్ తెలిపారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రచార ఖర్చుల వారీగా రేట్ల ఖరారు అంశంపై సంబంధిత అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ సమీక్షించారు. అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో పోటీచేసే అభ్యర్థులు ఎన్నికల సమయంలో తమ ప్రచారం నిమిత్తం చేసే ఖర్చు వివరాలు ఎన్నికల కమిషన్ తరపున నియమించిన అకౌంటింగ్ బృందాలు నమోదు చేస్తారని తెలిపారు. ఎన్నికల ప్రచార సమయంలో చేసే వివిధ కార్యక్రమాల్లో వినియోగించే వివిధ పరికరాల రేట్లను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు ప్రకారం ఎంపిక చేస్తామని, ఇందులో ఉన్న అభ్యంతరాలు చర్చించి వాటిని సవరించి, తుది రేట్ల జాబితాను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసినట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా అభ్యర్థులు చేసే వివిధ కార్యక్రమాల ఖర్చు లెక్కింపు ముందుగా అందజేసిన రేట్ల ప్రకారం నమోదు చేస్తామని అదనపు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ప్రతినిధి పోల్సాని సంపత్‌రావు, సీపీఐ(ఎం) ప్రతినిధి ముత్యంరావు, బీఎస్పీ ప్రతినిధి ఎన్ గోపాల్‌యాదవ్, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి ఎస్ ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఆర్ ప్రశాంత్, టీడీపీ ప్రతినిధి అక్కపాక తిరుపతి, ఎన్నికల డీటీ ప్రవీణ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలకు గైర్హాజరు

పెద్దపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్‌లో జరగాల్సిన స్థాయీ సంఘాల సమావేశాలకు ఆయా చైర్మన్లు, పలువురు సభ్యులు గైర్హాజరు కావడంతో నిర్వహించలేకపోయారు. బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆయా స్థాయి సంఘాల చైర్మన్ల అధ్యక్షతన జరగాల్సిన స్థాయీ సంఘాల సమావేశాలకు చైర్మన్లు, పలువురు జడ్పీటీసీలు హాజరుకావాల్సి ఉందని, కోరం లేని కారణంగా నిర్వహించలేదని జడ్పీ సీఈవో శ్రీనివాస్ తెలిపారు.

కనీస వేతనాల సవరణను గెజిట్‌లో ప్రచురించాలి

జ్యోతినగర్, జనవరి 10: కార్మికుల కనీస వేతనాల సవరణకు సంబంధించి 2021లో ఇచ్చిన రెండు జీవోలకు వెంటనే గెజిట్‌లో ప్రచురించాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి దేవసాని బిక్షపతి సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. బుధవారం బిక్షపతి, హైకోర్టు సీనియర్ న్యాయవాది ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం, జీవో కాపీలను అందజేశారు. రెండు జీవోలను గెజిట్లో ప్రచురించడంతోపాటు మిగిలిన 68 షెడ్యూల్డ్ ఎంప్లాయ్‌మెంట్‌కు కనీస వేతనాల సవరణకు సంబంధించి జీవోలు విడుదల చేసి గెజిట్‌లో పొందుపర్చాలని కోరారు. రాష్ట్రంలో 16 సంవత్సరాలుగా అసంఘటితరంగ కార్మికుల కనీస వేతనాల సవరణ జరగలేదని, దీంతో 1.20 కోట్ల మంది కార్మికులు కొనుగోలు శక్తి కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా ఇటీవల కాలంలో వచ్చిన కోర్టు తీర్పులు, కేంద్ర ప్రభుత్వ వివరణలు, ప్రొసీడింగ్స్‌కు సంబంధించిన పత్రాలను ముఖ్యమంత్రికి అందజేసినట్లు, ఇచ్చిన జీవోలను గెజిట్‌లో ప్రచురించాలని కోరినట్లు బిక్షపతి తెలిపారు. సీఎం సానుకూలంగా స్పందించారని భిక్షపతి తెలిపారు.

సమ్మక్క జాతర ప్రదేశాన్ని సందర్శించిన ఏసీపీ



సమ్మక్క జాతర ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ తులా శ్రీనివాసరావు

అంతర్గాం, జనవరి 10: అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ శివారు గోదావరినదీ తీర ప్రాంతంలో ఫిబ్రవరి 21 నుంచి 24వరకు జరుగనున్న సమ్మక్క-సాలమ్మ జాతర ప్రదేశాన్ని గోదావరిఖని ఏసీపీ తులా శ్రీనివాసరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏసీపీ స్నానఘట్టాల ప్రదేశం, క్యూలైన్ల ప్రాంతం, అమ్మవార్ల గద్దెలు, భక్తుల విడిది ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతర ప్రారంభం నాటికి నిర్వహణ ఏర్పాట్లను పూర్తి చేయాలని జాతర కమిటీ సభ్యులకు సూచించారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్, ఎస్ఐ సంతోష్‌కుమార్, ఎంపీడీవో బీ యాదగిరి, జాతర కమిటీ చైర్మన్ పెంద్రు హనుమాన్‌రెడ్డి, సర్పంచ్ దర్ని రాజేష్, జాతర కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాల్వశ్రీరాంపూర్, జనవరి 10: మోడల్ స్కూల్‌లో 6వ తరగతి, 7వ తరగతిలో అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 12 నుంచి ఫిబ్రవరి 22వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరిస్తున్నామన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7న నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆరో తరగతి విద్యార్థులకు 10 నుంచి 12గంటల వరకు ఏడో తరగతి విద్యార్థులకు రెండు నుంచి నాలుగు గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. జనరల్ విద్యార్థులకు రూ.200, ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీలకు రూ.125 అడ్మిషన్ ఫీజు చెల్లించాలని తెలిపారు.

పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్

సుల్తానాబాద్, జనవరి 10: త్వరలో జరుగనున్న పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని, ఎలాంటి ఆందోళన లేకుండా పరీక్షలు రాయాలని అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ విద్యార్థినులకు సూచించారు. మండలంలోని భూపతిపూర్ లోని కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాలను అదనపు కలెక్టర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాలయంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను పరిశీలించి వాటి గురించి స్పెషల్ ఆఫీసర్ స్వప్నతో పాటు విద్యార్థినులతో మాట్లాడారు. వంట గదులను, బియ్యం నాణ్యత, నిల్వలు ఇతరత్రా అంశాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఎంత మంది విద్యార్థినులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. వారికి బోధన ఎలా జరుగుతుంది అడిగి తెలుసుకుంటూ బాలికలతో కూడా మాట్లాడుతూ వారిలో పరీక్షలపై ఎలాంటి భయం ఉండవద్దంటూ పలు సలహాలు సూచనలు అందించారు. పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణను అలవర్చుకుని ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకుని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, కళాశాల స్పెషల్ ఆఫీసర్ స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమ్మక్క-సారక్క జాతర కమిటీ

ధర్మారం, జనవరి 10: మండలంలోని కొత్తూర్ సమ్మక్క-సారక్క జాతర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా తాళ్ల మల్లేశం, తాళ్లపల్లి లింగయ్య, అధ్యక్షుడిగా బానోత్ రాజేశం, ఉపాధ్యక్షులుగా చొప్పదండి మల్లేశం, నెరవట్ల రమేష్, మల్లెవుని లింగయ్య, రేషవేని రాజేశం, ప్రధాన కార్యదర్శులుగా కుంటూరి ప్రతాప్, సామల పెద్దమల్లయ్య, కోశాధికారిగా పుల్లకొల్ల లింగమూర్తి, సామల రాజయ్యను ఎన్నుకున్నారు. పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పండుగకు ఊరెళ్లే ప్రజలు పోలీసుల సూచనలను పాటించాలి: సీఐ



మంథని, జనవరి 10: సంక్రాంతి పండగకు ఇంటికి తాళం వేసి తమ స్వగ్రామాలకు వెళ్లే ప్రజలు పోలీసుల సూచనలు తప్పకుండా పాటించాలని మంథని జీ. సీఐ సతీష్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. సంక్రాంతి పండుగకి ఊరికి వెళ్లాలనుకునేవారు సాధ్యమైనంతవరకు ఇల్లు ఖాళీ చేసి వెళ్లకుండా, ఇంటి వద్ద ఎవరో ఒకరు ఉండేలా చూసుకోవాలన్నారు. ఊరికి వెళ్లేముందు ఇంటిలో ఎక్కువ మొత్తంలో నగదు, బంగారు ఆభరణణాలు ఉంచకుండా జాగ్రత్త వహించాలన్నారు. ప్రతీ పండుగకు పోలీసులు ఇచ్చే పలు సూచనలు ఇచ్చినప్పటికీనీ, కొంతమంది నిర్లక్ష్యం వహించి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడంతో పలుమార్లు దొంగతనాలు జరుగుతున్నాయన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ అరుణశ్రీ



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

కాల్వశ్రీరాంపూర్, జనవరి 10: ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. ప్రజాపాలన దరఖాస్తులు రాగా ఎంపీడీవో కార్యాలయంలో కంప్యూటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. దరఖాస్తుల ప్రక్రియను అదనపు కలెక్టర్ అరుణశ్రీ బుధవారం పరిశీలించారు. దరఖాస్తులను ఎలాంటి తప్పిదాలు లేకుండా త్వరగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ జాహెద్‌పాషా, ఎంపీడీవో రాంమోహనచారి, ఎంపీవో గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

ఓదెల: ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీ సంక్రాంతి సెలవుల ముందే పూర్తిచేయాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయాన్ని అరుణశ్రీ బుధవారం సందర్శించారు. ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులను కంప్యూటరీకరణ చేయడంలో ఎలాంటి జాప్యం చేయవద్దని సూచించారు. ఈ నెల 17 వరకు డేటా ఎంట్రీ చివరి తేదీ కాగా, సెలవులు వస్తున్నందున త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్తయ్య, తహసీల్దార్ యాకయ్య, ఎంపీవో జావేద్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమష్టి కృషి అవసరం

ఎంపీపీ ఆరెల్లి దేవక్క



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఆరెల్లి దేవక్క

రామగిరి, జనవరి 10: గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ ఆరెల్లి దేవక్క సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బేగంపేట్ గ్రామంలో విద్యుత్ లూజ్ లైన్స్‌ను పునరుద్ధరించాల్సిందిగా స్థానిక ఎంపీటీసీ కరుణ సమావేశంలో వెల్లడించారు. మండలం కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న మిషన్‌భగీరథ పనులతో పాటు, చేసిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోందని, స్థానిక సర్పంచ్ అల్లం పద్మ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సర్వసభ్య సమావేశానికి కొన్ని విభాగాలకు చెందిన అధికారులు గైర్హాజరు కావడంతో ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వసభ్య సమావేశానికి అన్ని విభాగాల అధికారులు హాజరు కావాలని, లేని పక్షంలో మండల పరిషత్ అధికారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. సభ్యులు వెల్లడించే సమస్యల పరిష్కారంలో ఆయా విభాగాలకు చెందిన అధికారులు పాత్ర కీలకమని వానే సభకు గైర్హాజరు అయితే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ప్రశ్నించారు. అనంతరం వివిధ శాఖలకు సంబంధించిన మినిట్స్‌ను చదివి వినిపించారు. సమావేశంలో ఎంపీడీవో రమేశ్, డిప్యూటి తహసీల్దార్ రాకేష్, సింగిల్‌విండో చైర్మన్ భాస్కర్‌రావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ విభాగల అధికారులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా అనుమతి లేని హోర్డింగ్‌లు

- రికార్డుల్లో 112, ఉన్నవి 250పైనే
- ప్రతి ఏటా కార్పొరేషన్‌కు లక్షల్లో ఫీజుల ఎగవేత
- టౌన్‌ప్లానింగ్‌పై కలెక్టర్ గరం



33కేవీ విద్యుత్‌లైన్ల కింద ఏర్పాటు చేసని హోర్డింగ్‌లు

కోల్‌సిటీ, జనవరి 10: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో విచ్చలవిడిగా ఎక్కడ పడితే అక్కడ అనుమతి లేని హోర్డింగ్‌లు వెలుస్తున్నాయి. ఒకటి కాదు రెండు కాదు కార్పొరేషన్ వ్యాప్తంగా వందల సంఖ్యలో ఉంటున్నాయి. నిబంధనలు తుంగలో తొక్కి ప్రమాదకరమైన హైటెన్షన్ విద్యుత్‌లైన్ల కింద, రోడ్డు జంక్షన్ వద్ద దర్జాగా పర్మినెంట్ హోరింగ్‌లు పెడుతున్నారు. కార్పొరేషన్‌కు ప్రతి ఏటా లక్షల రూపాయల అడ్వటైజ్‌మెంట్ ఫీజులు ఎగ్గొడుతున్నారు. అనుమతి లేని హోర్డింగ్‌లపై కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ దృష్టి సారించారు. కలెక్టర్ పరిశీలనలో వందల సంఖ్యలో అనుమతిలేని హోర్డింగ్‌లు ఉన్నాయని తేలడంతో టౌన్‌ప్లానింగ్ అధికారులపై గరమయ్యారు.

రామగుండం నగరపాలక సంస్థలో 9 అడ్వటైజ్‌మెంట్ ఏజెన్సీలు, 112హోర్డింగ్‌లు మాత్రమే ఉన్నట్టు రికార్డులు చెబుతున్నాయి. రూ.7లక్షల బకాయిలు ఉన్నట్టు తెలుస్తున్నది. కానీ వాస్తవంలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. అడ్వటైజ్‌మెంట్ ఏజెన్సీలు, వ్యక్తులు ఎవరికి వారుగా పెట్టిన హోర్డింగ్‌లు వందల సంఖ్యలో ఉన్నాయి. కొన్ని ఏజెన్సీలు కొన్ని హోర్డింగ్‌లకు అనుమతి తీసుకుని రెట్టింపు హోర్డింగ్‌లను పెడుతున్నారు. ఏజెన్సీలతో సంబంధం లేకుండా ప్రైవేట్ వ్యక్తులు, వ్యాపారులు, సంఘాలు, విద్యాసంస్థల యాజమాన్యాలు సైతం ఎవరికి వారుగా హోర్డింగ్‌లు పెడుతున్నారు. అనుమతులు కూడా తీసుకోవడం లేదు. విద్యుత్ లైన్ల కింద స్టేట్ హైవే, నేషనల్ హైవే జంక్షన్లు, విద్యాసంస్థలు, శ్మశానాల వద్ద హోర్డింగ్‌లు పెట్టేందుకు వీలు లేదు. రామగుండంలో ఉన్న హోర్డింగ్‌లలో 30 శాతం నుంచి 40శాతం హోర్డింగ్‌లు ప్రమాదకరమైన హైటెన్షన్ విద్యుత్ లైన్ల కింద ఉన్నాయి. స్టేట్ హైవే అయిన రాజీవ్ రహదారి అన్ని జంక్షన్ల వద్ద విచ్చల విడిగా హోర్డింగ్‌లు ఉన్నాయి. సీజన్‌ను బట్టి ఇష్టానుసారంగా అద్దెలు వసూలు చేస్తున్నారు. కార్పొరేషన్ నుంచి అనుమతులు కానీ, ఫీజులు కానీ చెల్లించడం లేదు. మున్సిపల్ కార్పొరేషన్ అనుమతిలేని ఒక్కో హోర్డింగ్‌కు అనధికార అనుమతికి రూ.10వేల నుంచి రూ.20వేలు కార్పొరేషన్‌లో ఖర్చు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.

మున్సిపల్ డైరెక్టర్ నిబంధనలు బేఖాతర్

అడ్వటైజ్‌మెంట్ హోర్డింగ్‌ల ఏర్పాట్లు, ఫీజుల వసూలుకు సంబంధించి మున్సిపల్ డైరెక్టర్ నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. తెలంగాణ మున్సిపల్ చట్టం 2019ని అనుసరించి అడ్వటైజ్‌మెంట్లను క్యాటగిరిలుగా విభజించి నిబంధనలు పెట్టారు. ఇందులో అనుమతులు, ఫీజులు, అనుమతుల ఉల్లంఘనలకు చర్యలు, పెనాల్టీలపై స్పష్టత ఉంది. నగరపాలక సంస్థ పరిధిలో అడ్వటైజ్‌మెంట్ ఏజెన్సీలు రూ.10వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. లక్ష రూపాయల సెక్యూరిటీ డిపాజిట్ కట్టాలి. గ్రౌండ్ లెవల్ హోల్డింగ్స్, రూఫ్ టాప్ హోల్డింగ్స్, బస్సులు, ట్యాక్సీలు, ఆటోలపై అడ్వటైజ్‌మెంట్లు, సినిమా హాళ్లు, కేబుల్ టీవీల్లో అడ్వటైజ్‌మెంట్ల ఫీజు వసూలుకు క్యాటగిరిలుగా విభజించారు. ప్రతి ఏజెన్సీ కార్పొరేషన్ కమిషనర్ నుంచి హోర్డింగ్ ఏర్పాటుకు సంబంధించి తప్పకుండా అనుమతి తీసుకోవాలి. నేషనల్, స్టేట్ హైవేలపై అనుమతి ఉండదు. స్టేట్ హైవే రోడ్డు జంక్షన్లకు వంద మీటర్ల దూరంలో మాత్రమే హోర్డింగ్‌లు పెట్టుకునేందుకు అనుమతి ఉంటుంది. హోర్డింగ్‌కు హోర్డింగ్‌కు మధ్య 15 నుంచి 30మీటర్ల దూరం ఉండాలి. విద్యుత్ లైన్ల కింద, సమీపంలో హోర్డింగ్‌లకు అనుమతి లేదు. 33కేవీ లైన్లకు 200మీటర్ల దూరం వరకు అనుమతి ఇవ్వవద్దని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. ఇక ప్రభుత్వ, మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి ప్రజా అవసరాల ప్రచారాలను ఉచితంగా కేటాయించాల్సి ఉంటుంది. వీటి ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలని కమిషనర్లకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలున్నాయి. అనుమతిలేని హోర్డింగ్‌లను తొలగించడంతో పాటు బకాయిలను ఏజెన్సీ లు, అనధికారిక హోర్డింగ్‌ల బకాయిలను హోర్డింగ్‌లు పెట్టిన వాటిని ఆస్తిపన్ను డిమాండ్‌లో జమ చేయాల్సి ఉంటుంది. అనధికారిక హోర్డింగ్‌లకు రోజుకు రూ.50వేల జరిమానా విధించాల్సి ఉంటుంది. స్ట్రక్చరల్ ఇంజనీర్ సర్టిఫికెట్ ఉంటేనే హోర్డింగ్‌లను అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది.

మారని కార్పొరేషన్ తీరు...

ఎలక్ట్రికల్ లైన్ల కింద హోర్డింగ్‌లు పెట్టేందుకు వీలు లేదు. కానీ రామగుండం లో 33కేవీ, 11కేవీ విద్యుత్‌లైన్ల కిందనే హోర్డింగ్‌లు పెడుతున్నారు. ఇప్పటికే నగూరి రాజ్‌కుమార్ అనే వ్యక్తి అడ్వటైజ్‌మెంట్ హోర్డింగ్‌లో ఫ్లెక్సీ మార్చుతూ హెచ్‌టీ వైర్లు తగిలి మృతి చెందాడు. దీనిపై వివాదం చోటుచేసుకుంది. అయినా కార్పొరేషన్ తీరు మారడంలేదు.

హోర్డింగ్‌లకు టెండర్ పెట్టని కార్పొరేషన్

రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో కార్పొరేషన్ రహదారుల పరిధికి వచ్చే స్థలాలు, కార్పొరేషన్ స్థలాల్లో హోర్డింగ్‌లు పెట్టేందుకు టెండర్లు నిర్వహించి అప్పగించాల్సి ఉంటుంది. గతంలో ఈ రీతిలో టెండర్లు కూడా నిర్వహించారు. కానీ కొన్నేళ్లుగా కార్పొరేషన్ దృష్టి పెట్టకపోవడంతో భారీగా ఆదాయం కోల్పోతోంది. వాస్తవానికి కార్పొరేషన్‌కు అడ్వటైజ్‌మెంట్ ట్యాక్స్‌ల ద్వారా రూ.60లక్షల నుంచి రూ.70లక్షల ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా రూ.5లక్షల నుంచి రూ.7లక్షలతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితులు ఉంటున్నాయి. దీనికి తోడు అనుమతి తీసుకున్న ఏజెన్సీలు సైతం ఫీజులు చెల్లించడం లేదు. చెల్లించాలని అడిగితే ఖాతరు చేసే పరిస్థితి కూడా లేదు. రామగుండంలో అనుమతి లేని అడ్వటైజ్‌మెంట్ హోర్డింగ్‌లు కాసుల పంట పండిస్తుండడంతో నిర్వాహకుల మధ్య ఆధిపత్య పోరు మొదలైంది. ఎవరికి వారుగా ఎక్కడ పడితే అక్కడ అనుమతిలేని హోర్డింగ్‌లు పెడుతుండడం, ఒకే స్థలానికి ఇద్దరు ముగ్గురు పోటీ పడుతుండడంతో వివాదాలు మొదలవుతున్నాయి. ఒకరుపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడమే కాకుండా ప్రత్యర్థుల హోర్డింగ్‌లు తొలగించాలంటూ కార్పొరేషన్‌లోని వివిధ స్థాయిల్లోని ప్రజా ప్రతినిధులను ఆశ్రయిస్తున్నారు.

కలెక్టర్ గరంగరం...

మున్సిపల్ కార్పొరేషన్ ఆదాయాన్ని పెంచాలని, అనుమతి లేని హోర్డింగ్‌లపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఈ మేరకు టౌన్‌ప్లానింగ్ అధికారులకు చీవాట్లు పెట్టారు. ఇప్పటికైనా కార్పొరేషన్ యంత్రాంగం కలెక్టర్ ఆదేశాలను పాటిస్తుందో లేదో వేచి చూడాల్సిందే.

బాలుడిని పనిలో పెట్టుకున్న వ్యాపారిపై కేసు

గంగాధర, జనవరి 10: బాలుడిని పనిలో పెట్టుకున్నందుకు గంగాధరలో ఓ వ్యాపారిపై బుధవారం జువైనల్ యాక్ట్ కేసు నమోదైంది. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా ప్రత్యేక బృందం గంగాధరలో తనిఖీలు చేపట్టింది. కిరాణ దుకాణంలో పనిచేసున్న 14 సంవత్సరాల బాలుడిని అధికారులు గుర్తించారు. బృందంలో సభ్యుడైన అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు జువనైల్ జస్టిస్ యాక్ట్ ప్రకారం 374ఐపీసీ ప్రకారం దుకాణదారుడిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. అనంతరం బాలుడిని జిల్లాలోని బాలల సమితి ముందు ప్రవేశపెట్టి బాలుడి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిసింది.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

పెగడపల్లి, జనవరి 10: గంజాయి రవాణా చేస్తున్న ఒక వ్యక్తిని బుధవారం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ సీహెచ్. సతీష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం సాయంత్రం గంజాయి సరఫరా చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పెగడపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద మల్యాల సీఐ కోటేశ్వర్ ఆధ్వర్యంలో పెగడపల్లి ఎస్ఐ సతీష్ పోలీస్ సిబ్బందితో కాపుకాసారు. అనుమానాస్పదంగా కనిపిం చిన వ్యక్తి వద్ద హ్యాండ్ బ్యాగ్ తనిఖీ చేయగా అందులో 1.720 కిలోలు గంజాయి లభించింది. దాని విలువ దాదాపు రూ.35 వేలు ఉంటుందని పోలీ సులు తెలిపారు. గంజాయి తరలిస్తున్న రాచర్ల వంశీ (22) వద్ద నుంచి గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ కోటేశ్వర్ తెలిపారు.

అదనపు వరకట్నం కేసు నమోదు

సిరిసిల్ల క్రైం, జనవరి 10: సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన అప్పాల మహేష్‌పై అదనపు వరకట్నం కేసు నమోదు చేసినట్లు సీఐ ఉపేం దర్ తెలిపారు. బుధవారం మహేష్ భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు భర్త మహేష్‌తో పాటు అత్త దేవలక్ష్మీ, మామ శంకరయ్య, కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వివాహమై 5 సంవత్సరాలు గడిచినప్పటికీ అదనంగా రూ.5 లక్షలు వరకట్నం తేవాలని మానసికంగా వేధించడంతో గృహహింస కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

సిరిసిల్ల క్రైం, జనవరి 10: సిరిసిల్ల పట్టణంలోని ఓ రైస్‌మిల్లులో క్వింటాల్ రేషన్ బియ్యం విక్రయించేందుకు వస్తున్న వేములవాడకు చెందిన బి రాజయ్యపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఉపేందర్ తెలిపారు. వేములవాడలో సేకరించిన క్వింటాల్ రేషన్ బియ్యాన్ని టీవీఎస్ చాంప్‌పై తీసుకవస్తుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

ధర్మపురి, జనవరి 10: ధర్మపురి మండలంలోని పెద్దనక్కలపేట గ్రామంలో అనుపురం లక్ష్మి(66) అనే వృద్ధురాలు బుధవారం బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మి ఆసుపత్రిలో చికిత్స చేయించుకోగా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె రాత్రి వేళలో ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఉదయం కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతకగా తన వ్యవసాయ బావిలో శవమై తేలింది. కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించి శవాన్ని బయటకు తీయించారు. మృతురాలి కొడుకు తిరుపతి ఫిర్యాదు మేరకు శవ పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ దత్తాత్రి ఆధ్వర్యంలో హెచ్‌సీ ఎండీ సలీం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చైల్డ్ పోర్న్ వీడియోలు షేర్ చేసిన వ్యక్తి రిమాండ్

వేములవాడ రూరల్, జనవరి 10: చైల్డ్ పోర్న్ వీడియోస్ షేర్ చేసిన వ్యక్తిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లికి చెందిన మల్యాల అరవింద్ చైల్డ్ పోర్న్ వీడియోలు డౌన్‌లోడ్ చేసి సోషల్ మీడియా ద్వారా ఇతరులకి షేర్ చేస్తున్నాడని హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ పోలీస్ నుంచి సమాచారం అందినట్లు తెలిపారు. ఈ మేరకు రూరల్ ఎస్సై మారుతి మంగళవారం సాయంత్రం చెక్కపల్లి శివారులోని పెద్దమ్మతల్లి గుడి వద్దకు వెళ్లగా అరవింద్ పారిపోవడానికి ప్రయత్నించాడని, వెంటనే పట్టుకొని అతడి ఫోన్ పరిశీలించగా అశ్లీల చిత్రాలు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. అరెస్టు చేసి విచారించగా అశ్లీల చిత్రాలను డౌన్ లోడ్ చేసి ఇతరులకు షేర్ చేసి డబ్బులు సంపాదిస్తున్నట్లు తెలిపాడన్నారు. దీంతో కేసు నమోదు చేసి రూరల్ సీఐ కృష్ణకుమార్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. చైల్డ్ పోర్న్ వీడియోస్ చూసినా, డౌన్‌లోడ్ చేసినా కఠిన చర్యలుంటాయని ఎస్పీ హెచ్చరించారు. ఇలాంటి వారిపై సైబర్ సెక్యూరిటీ పోలీసుల నిఘా నిరంతరం ఉంటుందని పేర్కొన్నారు.

తోట నిర్మలారాణికి అలిశెట్టి పురస్కారం


తోట నిర్మలారాణి

కరీంనగర్ కల్చరల్, జనవరి 10: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో అందించే అలిశెట్టి ప్రభాకర్ రాష్ట్రస్థాయి సాహిత్య పురస్కారాన్ని 2024 సంవత్సరానికి కరీంనగర్ కాపువాడకు చెందిన రచయిత్రి తోట నిర్మలారాణికి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఫిలింభవన్‌లో అందజేయనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కవి, విమర్శకుడు సీతారాం, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, తెరవే రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కొండి మల్లారెడ్డి, బూర్ల వేంకటేశ్వర్లు తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. కవులు, రచయితలు పాల్గొనాలని కోరారు.

రాజన్నకు భక్తుల మొక్కులు

వేములవాడ టౌన్, జనవరి 10: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో బుధవారం భక్తుల సాధరణ రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలను సమర్పించారు. అనంతరం ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించి రాజన్నను దర్శించుకున్నారు. రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడె మొక్కులు చెల్లించుకున్నారు.

ముగిసిన మల్లికార్జున స్వామి జాతర

గొల్లపల్లి, జనవరి 10: మండలంలోని మల్లన్నపేట గ్రామంలో ఏడు వారాలుగా జరుగుతున్న శ్రీ మల్లిఖార్జున స్వామి జాతర ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం చివరి రోజు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తులు ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేసి తమ ఇష్ట దైవానికి బోనాలు సమర్పించారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పూజారులు కొండూరు రాజేందర్ శర్మ, కొండూరు రఘునందన్ శర్మ వేద మంత్రోచ్ఛరణల నడుమ మల్లిఖార్జున స్వామికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా సర్పంచ్ సిద్ధంకి నర్సయ్య, ఎంపీటీసీ గోస్కుల రాజన్న, ఉప సర్పంచ్ బేర కిషోర్, ఆలయ ఈవో విక్రమ్, ఆలయ ఫౌండర్ ట్రస్ట్ కొండూరు శాంతయ్య ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. జాతర ఉత్సవాల్లో భాగంగా జగిత్యాల జడ్పీ సీఈవో రఘువరన్ జాతర చివరి రోజు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కన్నుల పండువగా వీరభద్రస్వామి కల్యాణం

తలంబ్రాలు తీసుకువచ్చిన మంత్రి పొన్నం దంపతులు

భీమదేవరపల్లి, జనవరి 10: కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి కల్యాణం.. కమనీయం..రమణీయంగా వేదపండితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య బుధవారం కన్నుల పండువగా జరిగింది. స్వామివారి కల్యాణానికి మంత్రి పొన్నం ప్రభాకర్-మంజుల దంపతులు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ప్రసిద్ధిగాంచిన కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు స్వామివారి కల్యాణంతో ప్రారంభమయ్యాయి. పూజా కార్యక్రమాల అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి వేలాది మంది భక్తుల సమక్షంలో కన్నుల పండువగా పల్లకిలో తీసుకువచ్చారు. స్వామివారి పుష్కరిణి పక్కన గల కల్యాణ మండపంలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని కొత్తకొండ దేవస్థానం మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా నిర్వహించారు. స్వామి వారి కల్యాణానికి కొత్తకొండ, ముస్తాఫాపూర్, ధర్మారం, చంటయ్యపల్లి, గొల్లపల్లి, గట్లనర్సింగాపూర్, తదితర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామి వారి కల్యాణాన్ని తిలకించి పులకించిపోయారు. ఆలయ ఈవో కిషన్‌రావు కార్యక్రమానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈసందర్భంగా భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు ఎల్కతుర్తి సీఐ ప్రవీణ్‌కుమార్, ముల్కనూర్, వంగర ఎస్‌ఐలు సాయిబాబు, నీలోజు వెంకటేశ్వర్లుతో పాటు పలువురు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ మేరకు స్వామివారి కల్యాణానికి మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయ ప్రాంగణాలన్ని కిటకిటలాడాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో కిషన్‌రావు, జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, మంజూలరెడ్డి, ఎంపీపీ జక్కుల అనిత-రమేష్, జడ్పీటీసీలు వంగ రవి, మాజీ చైర్మన్లు చంద్రశేఖర్‌గుప్తా, చిట్టంపల్లి అయిలయ్య, ఆర్ వెంకట్‌రెడ్డి, పిడిశెట్టి కనుకయ్య, కాసం రమేష్‌గుప్తా, సర్పంచ్‌లు దూడల ప్రమీల-సంపత్, రొంటాల ప్రభాకర్, గుంటి ఓదెలు తదితరులు పాల్గొన్నారు.


కొత్తకొండలో శ్రీవీరభద్రస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

డిగ్రీ పరీక్షల్లో 8 మంది డీబార్

గణేశ్‌నగర్, జనవరి 10: శాతవాహన విశ్వవిద్యాలయం డిగ్రీ ఒకటో, మూడో సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం 8మంది విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగప్రసాద్ తెలిపారు. సెమిస్టర్-1లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిరిసిల్లలో-1, శ్రీశివాని డిగ్రీ కళాశాల సిరిసిల్లలో-1, ప్రభుత్వ డిగ్రీ కళాశాల గంబీరావుపేటలో-4, అపూర్వ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో-1, మూడో సెమిస్టర్‌లో శివాని డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు డీబార్ అయినట్లు తెలిపారు.

నకిలీ గల్ఫ్ ఏజెంట్ రిమాండ్

కోనరావుపేట, జనవరి 10: నకిలీ గల్ఫ్ ఏజెంట్‌గా చలామణి అవుతూ ఓ ఇద్దరి వ్యక్తులను గల్ఫ్ దేశం పంపిస్తానని మోసం చేసిన నకిలీ గల్ఫ్ ఏజెంట్‌ను అరెస్టు చేసి బుధవారం రిమాండ్ పంపినట్లు కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు తెలిపారు. రుద్రంగి మండల కేంద్రంలోని బాలాజీ ట్రావెల్స్ యజమాని ధరావత్ విట్టల్, నిమ్మపల్లి గ్రామానికి చెందిన విక్రుతి రాజు, దొంతరవేణి మహేష్‌లను గల్ఫ్‌దేశం పంపిస్తానని చెరో లక్ష రూపాయలు తీసుకొని నకిలీ వీసా ఇచ్చి మోసం చేయడంతో అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు తెలిపారు.

డీ8 ఉపకాలువకు మరమ్మతు పనులు

గన్నేరువరం, జనవరి 10: మండలంలోని ఖాసింపేట నుంచి మాదాపూర్‌కు వెళ్లే డీ8 ఉపకాలువలో పిచ్చి మొక్కలు, మట్టి కూరుకుపోవడంతో గత సంవత్సరం నుంచి రైతులకు నీరందక ఆందోళన చెందుతున్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు బుధవారం కెనాల్‌లోని చెట్లు, మట్టిని తొలగించే పనుల ప్రారంభించారు. ఎంపిపి లింగాల మల్లారెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మెర రవిందర్‌రెడి, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

రమేష్‌బాబు పౌరసత్వం కేసు విచారణ వాయిదా

వేములవాడ టౌన్, జనవరి 10 : తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో వేములవాడ మాజీ శాసనసభ్యుడు చెన్నమనేని రమేష్‌బాబు కేసు బుధవారం విచారణ జరిగింది. ఈ మేరకు సుదీర్ఘ వాదనల అనంతరం రమేష్‌బాబు తరపు న్యాయవాదులను పూర్తి వివరాలతో రావాలని, కేసును తిరిగి శుక్రవారం వాయిదా వేస్తున్నట్లు కోర్టు తెలిపిందని ఆది శ్రీనివాస్ తరుపు న్యాయవాదులు పేర్కొన్నారు.

దొంగతనం కేసులో ఆరుగురి అరెస్టు

అంతర్గాం, జనవరి 10: విధుల్లో ఉన్న రైల్వే ఉద్యోగిని బెదిరించి రైల్వే ఆస్తిని దొంగిలించిన కేసులో ఆరుగురిని బుధవారం అరెస్టు చేసినట్టు రామగుండం రైల్వే ప్రొటక్షన్స్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) సీఐ బుర్ర సురేష్‌గౌడ్ తెలిపారు. డిసెంబరు 14న అంతర్గాం మండల పరిధిలోని విలేజి అంతర్గాం శివారు గోదావరి రైల్వే బ్రిడ్జి వద్ద ట్రాక్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం పవన్ కుమార్‌ను మంచిర్యాలకు చెందిన కడమంచి మహేష్, కడమంచి శ్రీను, చింతల శేఖర్, వనరాశి మల్లేష్, ఇగ్గన నగేష్, వనరాశి ఉప్పలయ్య బెదిరించి మెటీరియల్‌ను దొంగిలించారు. నిందితులను అదుపులోకి తీసుకుని దొంగిలించబడిన మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కాజీపేట రైల్వే కోర్టులో హాజరుపర్చనున్నట్టు సీఐ పేర్కొన్నారు. రైల్వే ఆస్తులను దొంగిలించినా, ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌పీఎఫ్ సీఐ బుర్ర సురేష్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ శేఖర్‌రెడ్డి, సిబ్బంది ఐలయ్య, సుమన్, ఓంవీర్ పాల్గొన్నారు.


నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఆర్‌పీఎఫ్ సీఐ సురేష్

బెల్టు షాపులపై పోలీసుల దాడులు

● రూ, 12,380ల మద్యం సీజ్ ● కేసు నమోదు

సైదాపూర్, జనవరి 10: సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి, రాయికల్ గ్రామాల్లో బెల్టు షాపులపై పోలీసులు దాడులు నిర్వహించారు. రూ.12,380ల మద్యం సీజ్ చేసి, నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు సైదాపూర్ ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు బుధవారం వెన్నంపల్లి, రాయికల్‌లో పోలీస్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. వెన్నంపల్లి గ్రామానికి చెందిన తోట రవి బెల్టు షాపులో రూ. 2580, రాయికల్ గ్రామానికి చెందిన బత్తిని రాజయ్య బెల్టు షాపులో రూ. 9,800ల మద్యం పట్టుకొని సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా గ్రామాలలో బెల్టు షాపులు నిర్వహిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై జన్ను ఆరోగ్యం హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 10: ఎల్లారెడ్డిపేట మండల శివారులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై బుధవారం రోడ్డు ప్రమాదంలో గంబీరావుపేటకు చెందిన యువకుడు కిషోర్‌తో పాటు మరో యువకుడు కుల్‌దీప్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కిషోర్, కుల్‌దీప్‌కుమార్ బైక్‌పై పెట్రోల్ బంక్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా గొల్లపల్లి నుంచి సిరిసిల్ల వైపునకు వెళ్తున్న ట్రాలీ ఆటో ఢీకొట్టింది. సమాచారం అందుకున్న ఎస్సై రమాకాంత్ క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కుల్‌దీప్‌కుమార్ పరిస్థితి విషమంగా మారడంతో సిరిసిల్లకు తీసుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ చెట్టుకు ఢీకొని డ్రైవర్ మృతి

మానకొండూర్, జనవరి 10: మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామంలో బుధవారం చెట్టుకు ట్రాక్టర్ ఢీకొని డ్రైవర్ మృతి చెందినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గయ్యపల్లికి చెందిన నందగిరి సాయినంద్ (26) అనే యువకుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. జగ్గయ్యపల్లి నుంచి కూలీలతో ట్రాక్టర్‌లో శ్రీనివాస్‌నగర్ గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో ఓ వాహనాన్ని తప్పించబోయి పక్కన ఉన్న చెట్టును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సాయినంద్ తలకు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి సోదరి తిరుమల ఫిర్యాదు మేరుకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైతు వేదికలో ప్రైవేట్ కంపెనీ కార్యక్రమం

శంకరపట్నం, జనవరి 10: శంకరపట్నం మండలం కన్నాపూర్ క్లస్టర్ రైతు వేదికలో ఓ ప్రైవేట్ పెస్టిసైడ్ కంపెనీ ప్రమోషన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ రైతు వేదికలో ప్రైవేట్ కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తారని కొంత మంది స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ప్రైవేట్ కంపెనీ బుధవారం రైతు వేదికలో పెస్టిసైడ్స్ ప్రమోషన్ కార్యక్రమం నిర్వహించడానికి స్థానికంగా ఉండే రైతులను పెద్ద సంఖ్యలో పోగు చేసి కార్యక్రమం నిర్వహించారు. ఈ విషయంపై మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌ను వివరణ కోరగా తన అనుమతి లేకుండానే కార్యక్రమం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ఎలాంటి అనుమతి ఇవ్వలేదన్నారు.

ప్రకృతి వనం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

ఇల్లందకుంట, జనవరి 10: మండలంలోని ఎర్రగట్టు గుట్ట సమీపంలోని బోగంపాడు, సిరిసేడు గ్రామాల ప్రకృతి వనాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులను వెంటనే శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వంగ రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ధ్వంసం చేసిన ప్రకృతి వనాన్ని కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. దీనిపై అధికారులు పట్టించుకోవడం లేదనే అనుమానం వస్తోందన్నారు. సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు చోద్యం చేస్తూ వారికి సంబంధం లేనట్టుగా వ్యవహరించడం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో అజ్గర్, బోగం శ్యామ్, మురహరి నరేందర్, రేణుకుంట్ల సారయ్య, మర్రి సాయి, రేణుకుంట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ పూరి గుడిసె దగ్ధం

కాల్వశ్రీరాంపూర్, జనవరి 10: మండలంలోని తారుపల్లి గ్రామానికి చెందిన దోబుల మొగిలికి చెందిన పూరి గుడిసె ప్రమాదవశాత్తు నిప్పంటుకుని బుధవారం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో విలువైన సామగ్రితో పాటు టేకు దుంగలు, రెండు బైకులు పూర్తిగా కాలిపోయాయి. గుడిసెలో ఉన్న గేడె, గేడె పిల్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు ఐదు లక్షల ఆస్తి నష్టం జరిగినట్టు ఇంటి యజమాని మొగిలి తెలిపారు. సంఘటన స్థలాన్ని మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, ఆర్ఐ నర్సింగం పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గుడిసెలో ఉన్న విలువైన వస్తువులతో పాటు రెండు బైకులు పూర్తిగా కాలిపోయాయని, ప్రమాదం జరిగినప్పుడు గుడిసెలో ఉన్న గేదెలకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం అందేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాదాసి సతీష్, నకినపల్లి స్వామి, దోబుల మోహన్‌రావు, దోబుల మల్లయ్య, అంజన్న పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, జనవరి 10 : కరీంనగర్ రూరల్ మండలం సీతారాంపూర్ గ్రామంలో నివాసం ఉంటున్న బత్తిని శ్రీకాంత్(25) అనే యువకుడు కడుపునొప్పి భర్చలేక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కొత్తపల్లి ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ భార్య, పిల్లలతో సహా గత కొద్ది రోజులుగా సీతారాంపూర్‌లో ఉంటూ ఒక గ్యాస్ కంపెనీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. కొద్దిరోజుల నుంచి అతను కడుపునొప్పితో బాధపడుతూ ఆర్‌ఎంపీ వద్ద గోళీలు తెచ్చుకుని వాడకుంటుండేవాడని మృతుడి భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. బుధవారం ఉదయం 9 గంటలకు కడుపునొప్పి వస్తుందని పడుకుంటానని చెప్పి గదిలోకి వెళ్లి కొద్దిసేపటికి ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడని, వెంటనే భార్య, తల్లిలు కలిసి ఉరినుంచి శ్రీకాంత్‌ను కిందకు దించి ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, జనవరి 10 : ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ట్రాక్టర్లను పట్టుకున్నామని కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు బుధవారం ఉదయం 4:30 గంటలకు మానేరు బైపాస్ రోడ్‌లో ఇసక ట్రాక్టర్‌ను పట్టుకుని ఠాణాకు తరలించినట్లు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ శివరాత్రి కుమారస్వామిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే కట్టరాంపూర్‌లో మంగళవారం అర్ధరాత్రి ఇసుక ట్రాక్టర్‌ను బ్లూకోల్ట్ పోలీసులు తనిఖీ చేయగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు వెల్లడైందని పోలీసులు తెలిపారు. డ్రైవర్ లోకిని రమేష్‌పై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామన్నారు.

నామినేటెడ్ పదవుల్లో ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇవ్వాలి

కరీంనగర్ టౌన్, జనవరి 10: రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవుల్లో హైదరాబాద్ కేంద్రంగా పనిచేసిన నాయకులకే కాకుండా అన్ని జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో పనిచేసిన ఉద్యమకారులను గుర్తించి ప్రాధాన్యం ఇవ్వాలని టీజేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పదేళ్లుగా నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా పనిచేసిన వారిని, ప్రజల పక్షాన ఉద్యమించిన వారిని గుర్తించాలని కోరారు.

కొండగట్టు హుండీ లెక్కింపులో చేతివాటం

● రూ. 11,010 అపహరణ ● నిందితుడిని పోలీసులకు అప్పగించిన దేవస్థానం అధికారులు

మల్యాల, జనవరి 10: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం హుండీలను బుధవారం లెక్కింపు చేపట్టగా ఆలయ ప్రసాదాల తయారీలో పనిచేసే తాత్కాలిక ఉద్యోగి ఒకరు నగదు దొంగిలించాడు. లెక్కింపు సందర్భంగా ఆలయంలోని హుండీలను విప్పి సంచులతో అందులోని డబ్బులను తీసుకువచ్చి ప్రాకార మండపంలో లెక్కింపు చేస్తుంటారు. అయితే లెక్కింపునకు ముందు నాణేలను, నగదును వేరు చేస్తారు. వేరు చేసే క్రమంలో ప్రసాదాల తయారీ సిబ్బంది కొడిమ్యాల మండలం నాచుపల్లికి చెందిన కొలగాని రవి అనే సిబ్బంది రూ.500నోట్లు 11తో పాటు రూ. 10 అందులో నుంచి తీసి దాచుకోవడంతో అక్కడ లెక్కింపునకు వచ్చిన భక్తుడు ఒకరు చూసి అధికారులకు సమాచారం అందించాడు. దీంతో అక్కడే గల ఉమ్మడి కరీంనగర్ దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఈవో వెంకటేష్ వెంటనే అతన్ని అక్కడి ఏఎస్సై చిలుక శ్రీనివాస్‌తో పాటు పోలీసులకు అప్పగించి నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మల్యాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈవో ఫిర్యాదు మేరకు పోలీసులు రవిపై కేసు నమోదు చేశారు.

● పర్యవేక్షణ అంతంత మాత్రమే

భక్తులు సమర్పించే డబ్బులు, బంగారు, వెండి కానుకల లెక్కింపు, తూకంపై ఏళ్లుగా ఆరోపణలు ఉన్నాయి. లెక్కింపు సమయంలో సిబ్బంది చేతివాటంకు పాల్పడిన సంఘటనలు ఉండగా కౌంటింగ్ ప్రక్రియపై తరచూ విమర్శలు వస్తూనే ఉన్నాయి. హుండీల కౌంటింగ్ సందర్భంగా దేవస్థానం అధికారులు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, సీసీ కెమెరాల పర్యవేక్షణలో దేవస్థానం అధికారులు, పోలీసుల సమక్షంలో కౌంటింగ్ చేపడుతుంటారు. పర్యవేక్షణ పకడ్బందీగా లేక తరచూ దొంగతనాలు జరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. గతంలో హుండీ లెక్కింపు సమయంలో చోరీ ఘటనలు జరిగినా పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.


హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

హుండీ ఆదాయం రూ.71.73 లక్షలు

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం హుండీల ఆదాయాన్ని అధికారులు బుధవారం లెక్కింపు చేపట్టారు. 35 రోజులకు హుండీల ద్వారా రూ.71,73,723 నగదు దేవస్థానంకు సమకూరింది. ఈ లెక్కింపులో నగదుతో పాటు 51 గ్రాముల మిశ్రమ బంగారం, 3.200కిలోల మిశ్రమ వెండి, 30 విదేశి కరెన్సీ లభించినట్లు ఈఓ పి.వెంకటేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ దేవాదాయశాఖ ఏసీ చంద్రశేఖర్, ఏఈవో బుద్ది శ్రీనివాస్, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్, ఆలయ సిబ్బంది, ఏఎస్సై చిలుక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు


సినీనటి అనన్యతో సెల్ఫీ దిగుతున్న యువతులు, మహిళలు


ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గు వద్ద మహిళలు

ముగ్గుల హరివిల్లు

ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్


ముగ్గు వేస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని


ముగ్గు వేస్తున్న కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి


ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్: స్వర్గసీమ సుకేతన) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్స్‌లో పోటీదారులు వేసిన ముగ్గులతో ఇంద్రధనస్సు నేలకు దిగి వచ్చిందా అనిపించింది. తెలంగాణవ్యాప్తంగా 45 కేంద్రాల్లో పోటీలు జరగగా, ఉమ్మడి జిల్లా నుంచి ఒకరు ఫైనల్స్‌లో తమ ముగ్గులతో పోటీ పడ్డారు. సినీనటి అనన్య నాగళ్ల, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినితో పాటు కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సినీనటి అనన్య


ముగ్గులు వేస్తున్న మహిళలు




అతిథులకు స్వాగతం పలుకుతున్న ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, స్టేట్ బ్యూరో చీఫ్ ఉప్పులూరి మురళీకృష్ణ

సింగరేణి సమాచారం

కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలి

గోదావరిఖని, జనవరి 10: సింగరేణిలో పనిచేస్తున్న 32వేల మంది కాంట్రాక్టు కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు అమలు చేసి ఆదుకోవాలని టీఎస్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంకే బోస్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మకాయల ఏడుకొండల రాజు సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌కు విన్నవించారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లోని సీఎండీని కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో కాంట్రాక్టు కార్మికులు 18 రోజులు సమ్మె చేసిన సందర్భంగా 12డిమాండ్లపై యాజమాన్యం అగ్రిమెంట్ చేసుకున్నప్పటికీ అమలుకు నోచుకోలేదని, కాంట్రాక్టు కార్మికుల సీఎంపీఎఫ్‌లో అనేక అవకతవకలు జరుగుతున్నాయని తెలిపారు. సింగరేణిలో అనే క్వార్టర్లు ఖాళీగా ఉన్నాయని కాంట్రాక్టు కార్మికులకు క్వార్టర్లు కేటాయించాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులకు మొదటి క్యాటగిరి వేతనాన్ని అమలు చేయాలని, సిక్ లీవులు, పండుగ దినాల్లో మాస్టర్‌తో కూడిన వేతనాలు అమలు చేయాలని, కాంట్రాక్టు కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని కోరారు. నూతన బొగ్గు గనులను ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్యను నిర్మూలించాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన జీఎంలు

గోదావరిఖని, జనవరి 10: కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అడిషనల్ కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్‌ను పెద్దపల్లి కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం సింగరేణి జీఎంలు కలిశారు. ఆర్‌జీ-1 జీఎం చింతల శ్రీనివాస్, ఆర్‌జీ-2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ, ఆర్‌జీ-3 జీఎం సుధాకర్‌రావు జిల్లా పాలన అధికారులను కలిశారు. ఈ సందర్భంగా ఆర్‌జీ-1 ఏరియాకు సంబంధించిన భూ సేకరణ అనుమతులు, ఆర్అండ్ఆర్ సమస్యలపై కలెక్టర్‌తో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జీ-1 ఎస్టేట్ మేనేజర్ బాల సుబ్రహ్మణ్యం, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి ఉన్నారు.

ఓసీపీ-1లో బ్లాస్టింగ్‌తో పలువురికి గాయాలు


బ్లాస్టింగ్‌తో రోడ్డుపై పడిన బండరాళ్లు

రామగిరి, జనవరి 10: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-1లో బుధవారం జరిగిన బ్లాస్టింగ్‌లో పలువురు వాహనదారులు గాయపడ్డారు. బ్లాస్టింగ్ జరిగిన సమయంలో రోడ్డుపైకి పెద్దఎత్తున వస్తున్న బండ రాళ్లతో వాహదారులు బెంబేలు పడి పరుగులు తీశారు. పదో గని మీదుగా 8వ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న ఓసీపీ-1 బ్లాస్టింగ్ గ్యాలరీలో బుధవారం బ్లాస్టింగ్ చేపట్టారు. పెద్దఎత్తున రాళ్లు తారు రోడ్డుపై పడ్డాయి. దీంతో అటుగా వెళ్తున్న పలువురు వాహనదారులు స్వల్పంగా గాయాల పాలయ్యారు. బ్లాస్టింగ్ సమయంలో రహదారిలో చెక్ పోస్టు ఉన్నప్పటికీ వాహదారులను నిలిపివేయకపోవడంతో బ్లాస్టింగ్‌తో పెద్దగా వచ్చిన రాళ్లు తారు రోడ్డు పై వెళ్తున్న వాహన దారులపై పడి గాయపడ్డారు. బ్లాస్టింగ్ నిబంధనల పై నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై వాహదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి అధికారులు బ్లాస్టింగ్ సమయంలో పలు జాగ్రత్తలు చేపట్టాలనే విషయాన్ని విస్మరించడంపై పలు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. బ్లాస్టింగ్ ఇన్‌చార్జిపై శాఖపరమైన చర్యలు చేపట్టాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

- డీవైడీజీఎంఎస్ అజయ్‌సింగ్


సమావేశంలో మాట్లాడుతున్న డీవైడీజీఎంఎస్ అజయ్‌సింగ్

గోదావరిఖని, జనవరి 10: సింగరేణిలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ విద్యుత్ ప్రమాదాలపై ఎళ్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్‌కు సంబంధించిన రక్షణ చర్యలు తీసుకోవాలని డీవైడీజీఎంఎస్(ఎలక్ట్రికల్) అజయ్‌సింగ్ అన్నారు. బుధవారం ఆర్‌జీ-1 జీఎం కార్యాలయంలో విద్యుత్ రక్షణ, నిర్వహణ, భద్రత చర్యలపై ఆయన మాట్లాడారు. రామగుండం రీజియన్ స్థాయిలో ఈ అంశంపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అజయ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యుత్ లైటింగ్ నుంచి రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలు, ఎర్తింగ్ ప్రాముఖ్యత, లోటో సిస్టం ఆవశ్యకతలపై ఆయన వివరించారు. విద్యుత్ ప్రమాదాల పట్ల ఎళ్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదాల నియంత్రణ కోసం విద్యుత్ నియంత్రణ, సరఫర, ఎర్తింగ్, పవర్ ట్రాన్స్‌మిషన్, లైఫ్ సేవింగ్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జీ-1, 2, 3 జీఎంలు చింతల శ్రీనివాస్, ఎల్వీ సూర్యనారాయణ, జీఎం(ఈఅండ్ఎం, వర్క్‌షాప్స్) ఫిడ్డాడ్, జీఎం (ఈఅండ్ఎం , స్టోర్స్) శేషుకుమార్, రామగుండం రీజియన్ జీఎం(సేఫ్టీ) సాంబయ్య, ఎస్‌ఓటూ జీఎం రాంమోహన్, ఆర్‌జీ-1 ఏజీఎం (ఈఅండ్ఎం) రాంమూర్తి, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్లు ఎలక్ట్రికల్, ప్రాజెక్టు ఇంజనీర్లు, గ్రూప్ ఇంజనీర్లు, పిట్ ఇంజనీర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

సచ్‌దేవలో వార్షిక క్రీడా దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న కేదార్ రంజన్

జ్యోతినగర్, జనవరి 10 : ఎన్టీపీసీ టీటీఎస్‌లోని సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో బుధవారం పాఠశాల క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు ముఖ్య అతిథిగా హాజరై క్రీడోత్సవాన్ని ప్రారంభించారు. పాఠశాల పరిధిలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీలలలో విజేతలకు ఈడీ కేదార్ రంజన్ బహుమతులు అందజేశారు. ఈడీ ప్రసంగిస్తూ విద్యార్థులు చదువుతోపాటు ఆటలపై మక్కువ పెంచుకోవాలన్నారు. క్రీడల వల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ పెరగడం తోపాటు శారీరక, మానసిక ధారుడ్యం పెంపొందుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎన్టీపీసీ ఏజీఎం (హెచ్ఆర్) విజయ్‌కుమార్ సిక్దర్, మేనేజర్ శ్రీనివాస్, సచ్‌దేవ ప్రిన్సిపాల్ జ్ఞాన్‌చంద్, హెచ్ఎం ఆరంజ్యోతి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయండి

- సీఎండీని కలిసిన మాజీ ఎమ్మెల్యే చందర్


సీఎండీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చందర్

గోదావరిఖని, జనవరి 10: రామగుండం కార్పొరేషన్ పరిధిలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమసయంలో సింగరేణి సంస్థ ద్వారా మంజూరైన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని సింగరేణి సీఎండీ బలరాంను రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. నూతనంగా సింగరేణి సీఎండీగా బాధ్యతలు తీసుకున్న బలరాంను హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో బుధవారం కోరుకంటి చందర్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామగుండంకు మంజూరైన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆయన కోరారు. డిజిటల్ లైబ్రరీ నిర్మాణం కోసం గతంలో రూ.2కోట్ల నిధులు మంజూరు చేశారని, వాటి పనులు ప్రారంభించాలని సీఎండీని చందర్ కోరారు. జనగామ బ్రిడ్జి, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి ఫైవింక్లయిన్ వరకు రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని చందర్ సీఎండీకి వివరించారు. అదే విధంగా వార్డుల్లో వాటర్ ప్లాంట్లను తొందరగా ప్రారంభించాలని చందర్ కోరారు.

జాతీయ యువజనోత్సవాలకు ఎన్ఎస్ఎస్ వలంటీర్

కోల్‌సిటీటౌన్, జనవరి 10: మహారాష్ట్రలోని నాసిక్‌లో ఈనెల 12 నుంచి 16వరకు జరిగే జాతీయ యువజన ఉత్సవాలకు గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్ రంగు నితీష్ ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వ యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాతీయ యువజన ఉత్సవాలలో తెలంగాణ రాష్ట్రం తరుపున నితీష్ ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 1000పైగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొనే ఈ ఉత్సవాలలో తెలంగాణ నుంచి నితీష్ పాల్గొనడం విశేషం. కాగా బుధవారం కళాశాల ఆవరణలో నితీష్‌ను ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రమాకాంత్, శాతవాహన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ మనోహర్ పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సురేష్‌కుమార్, డాక్టర్ రమేష్, అజయ్‌కుమార్, రవి, సావిత్రి, సల్మాసుల్తానా, అజయ్, యాదయ్య, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

సంక్షిప్త సమాచారం..

పాలకుర్తి: పుట్నూర్, ఎలుకలపల్లి, బసంత్‌నగర్, పాలకుర్తి, కొత్తపల్లి ఎంపీటీసీలు గంగాధరి రమేష్‌గౌడ్, పాలడుగుల సతీష్, పాత భాగ్యలక్ష్మీ, దుర్గం కుమార్, సంతపురి ప్రియాంక పాలకుర్తి ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం కోసం వెంటనే పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేయాలని పెద్దపల్లి ఆర్డీవో సీహెచ్ మధన్‌మోహన్‌కు వినతిపత్రం బుధవారం అందించారు.

రామగిరి: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని జీఎం కార్యాలయంలో 2024 సింగరేణి క్యాలెండర్‌ను జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదికారులు రఘుపతి, ఎలీషా, శ్రీనివాసులు, జైనుల్లాబద్దిన్, రవీందర్‌రెడ్డి, రాజారెడ్డి, సత్యనారయణ, వివిధ విభాగాల అదికారులు పాల్గొన్నారు.

- రామగిరి మండలంలోని కల్వచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని మారుతీనగర్ సమీపంలో ఎలాంటి అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తున్న వెంచర్ హద్దు రాళ్లను గ్రామపం చాయతీ సిబ్బంది బుధవారం తొలగించారు.

పెద్దపల్లి కల్చరల్: జనవరి 11న గురువారం ఉదయం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించే ఒడ్డే ఓబన్న జయంతి ఉత్సవంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ బీసి సంఘం నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి రంగారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మంథని: మంథని నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంథని ఆర్డీవో కార్యాలయంలో ఈఆర్వో హనుమా నాయక్ బుధవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వివిధ అంశాలపై చర్చించారు. నియోజకవర్గంలోని 10 మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

- స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలిక జూనియర్ కళాశాలను ఆర్డీవో హనుమా నాయక్ బుధవారం సందర్శించారు. కళాశాల అవరణను, వంటగదిని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పెద్దపల్లి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పలు సబ్జెక్టులపై అర్థమయ్యే విధంగా విద్యాబోధన చేపడుతున్నట్లు మండల విద్యాధికారి సురేంద్రకుమార్ అన్నారు. బుధవారం మండలంలోని అప్పన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలలో పెద్దపల్లి, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల ప్రాథమికోన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు హిందీ సబ్జెక్టును విద్యార్థులు సులువుగా అర్థం చేసుకునే విధంగా పాఠ్య ప్రణాళిక, మెటీరియల్‌ను తయారు చేశారు.

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లి గ్రామ ఉపసర్పంచ్ జన్నే శ్రీకాంత్‌పై వార్డు సభ్యులు పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. మంథని ఆర్డీవో హనుమాన్ నాయక్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్, వార్డు సభ్యుల సమక్షంలో నిరహించిన బల పరీక్షలో 12 మంది వార్డు సభ్యులకు గాను ఆరుగురు సభ్యులు అవిశ్వాసానికి మద్దతు తెలపడంతో ఉప సర్పంచ్ పై అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీవో ప్రకటించారు.

కోల్‌సిటీటౌన్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గోదావరిఖని జవహర్‌నగర్‌లోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. పాఠశాల అధ్యక్షురాలు సోమారపు లావణ్య, డాక్టర్ వనజారాపోల్, అడ్వకేట్ ఏలేశ్వరం చంద్రమౌళి, పాఠశాల కార్యదర్శి గంధం రవీందర్ పాల్గొన్నారు.

ఫైవింక్లయిన్‌కాలనీ: సంక్రాంతిని పురస్కరించుకుని స్పందన మోడల్ స్కూల్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాఠశాల విద్యార్థినిలు, పోషకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో జక్కుల దామోదర్‌రావు, కండెం సురేష్, రాంరెడ్డి, కిషన్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్: మైనార్టీల సంక్షేమం కోసం రామగుండం ఎమ్మెల్యే ఎనలేని కృషి చేస్తున్నారని రామగుండం మైనార్టీ సంక్షేమ సంఘం నాయకులు ఆసిఫ్, ఎండీ యాకూబ్ అన్నారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రామగుండంలోని మైనార్టీలందరూ కాంగ్రెస్ పక్షాన ఉన్నారని, ఈ ప్రాంతంలో మైనార్టీల అభివృద్ధికి మక్కాన్ సింగ్ చేస్తున్న సేవలు మరువలేనివన్నారు.

ఓదెల: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం ఉపాధి హామీ సామాజిక తనిఖీప్రజా నివేదికను నిర్వహించనున్నారు. నాలుగు కోట్ల ఖర్చు తుది నివేదికలను వెల్లడించనున్నారు.

మార్కండేయకాలనీ: సంక్రాంతి పర్వదినం సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకుడు నాజీమోద్దీన్ ఆధ్వర్యంలో 7వ డివిజన్‌లోని ఉదయ్‌నగర్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు పాల్గొని రంగవల్లులు వేశారు. అనంతరం రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు.